RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | ఆదివారం | పేజీలు 8 | లింగబత్తిని కృష్ణ సీఎండీ & ఎడిటర్ 9701923260

సంపుటి: 4 సంచిక:126 | మే 10, 2026 | వెల: రూ.3-00

## తమిళ పీఠంపై తళపతి



- సీఎంగా నేడు విజయ్ ప్రమాణ స్వీకారం
- టీవీకేకు 120 మంది సభ్యుల మద్దతు
- ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్
- రాష్ట్రవ్యాప్తంగా అభిమానుల సంబరాలు

2లో




## మద్యం తాగించి మైనర్ బాలికపై అత్యాచారం చేసినట్లు ఆరోపణలు

- హైదరాబాద్ పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో అర్ధరాత్రి హైడ్రామా
- మొదట కేసు పెట్టేందుకు పోలీసుల నిరాకరణ..
- బాధితుల ఆందోళనతో వెనక్కి తగ్గిన యంత్రాంగం
- హనీట్రాప్ చేసి బ్లాక్ మెయిల్ చేస్తున్నారంటున్న సంజయ్ కొడుకు
- కరీంనగర్‌లో భగీరథ్ ఎదురు ఫిర్యాదు
- గతంలోనే 50 వేలు చెల్లించానన్న కేంద్ర మంత్రి కుమారుడు
- సోషల్ మీడియాలో నెటిజన్ల ప్రశ్నల వర్షం.. ఫైర్
- గతంలోనూ యూనివర్సిటీలో ర్యాగింగ్ కేసులు
- సంజయ్ ను మంత్రి పదవి నుంచి తప్పించాలంటూ ఢిల్లీకి చేరిన ఫిర్యాదులు

**మోడీ రాష్ట్ర పర్యటన వేళ ఇమేజ్ డ్యామేజ్**







సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్ ఫోటోలు..

# బండికి సన్ స్ట్రోక్!

**కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కొడుకు సాయి భగీరథ్‌పై పోక్సో కేసు**

**వేద న్యూస్, ఫోకస్ టీమ్**

ఒకవైపు కరీంనగర్ గడ్డపై బండి సంజయ్, బీఆర్ఎస్ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా ఆధిపత్య పోరు సాగుతుంటే.. మరోవైపు బండి సంజయ్ వారసుడు సాయి భగీరథ్ పై పోక్సో కేసు నమోదవడంతో దేశవ్యాప్త ప్రకంపనలు సృష్టిస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ భాగ్యనగర పర్యటనకు ముందు దేశ శాంతి భద్రతలను పర్యవేక్షించే మంత్రి తనయుడిపైనే మైనర్ బాలికపై అత్యాచారం వంటి దారుణమైన ఆరోపణలు వెల్లువెత్తడం కాషాయ దళాన్ని డిఫెన్స్‌లోకి నెట్టింది. ఒకవైపు హనీట్రాప్ అంటూ మంత్రి వర్గం వాదిస్తుంటే, మరోవైపు బాధితుల ఆక్రందనలు ఢిల్లీ పీఠాన్ని తాకుతున్నాయి. అసలే అంతర్గత పోరుతో సతమతమవుతున్న రాష్ట్ర బీజేపీలో.. పుత్రరత్నం చేసిన ఈ నిర్వాకం బండి సంజయ్ రాజకీయ భవిష్యత్తును, మంత్రి పదవిని ఏ తీరానికి చేరుస్తుందనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

2లో

## 'పాలమూరు-రంగారెడ్డి'పై ఉద్యమిస్తాం



2లో

- దసరా లోపు పనులు ప్రారంభించకపోతే పాదయాత్ర తప్పదు
- సాగునీటి సాధన కోసం టీఆర్ఎస్ పోరాడుతుంది
- అధికారంలోకి వస్తే మహిళలు, యువతకు పెట్టుబడి సహాయం
- తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత



## బీసీ కులగణనకు కేంద్రంపై ఒత్తిడి పెంచాలి

- అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం
- హనుమంతరావు నిరాహార దీక్షకు టీఆర్పీ సంపూర్ణ మద్దతు

2లో

## ట్రాఫిక్ ఫ్రీ హైదరాబాదే లక్ష్యం

- సమస్య పరిష్కారానికి బహుళ ప్రణాళికలు
- మూసీ పునరుజ్జీవంతో కాలుష్య నియంత్రణపై దృష్టి
- కోర్ అర్బన్ రీజియన్ అభివృద్ధిపై ఫోకస్
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ



**వేద న్యూస్, హైదరాబాద్**

ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని కోర్ అర్బన్ రీజియన్ సమస్యలను పరిష్కరిస్తూ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్ నగరాన్ని ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోందని ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని నగరాభివృద్ధి ప్రణాళికలను వివరించారు. పెరుగుతున్న నగరీకరణతో భవిష్యత్తులో మరిన్ని సవాళ్లు ఎదురయ్యే అవకాశముందని పేర్కొన్న ముఖ్యమంత్రి, వాటిని ఎదుర్కొనేందుకు ముందస్తుగా మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. హైదరాబాద్‌ను ట్రాఫిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దేందుకు కీలక ప్రాంతాల్లో అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్లు, ఉపరితల రహదారుల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. కేవలం రోడ్ల విస్తరణతోనే ట్రాఫిక్ సమస్యలు తగ్గవని, బహుళ రవాణా విధానాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని సీఎం పేర్కొన్నారు. నగరంలో పార్కింగ్ సమస్యలను తగ్గించేందుకు మల్టీ లెవెల్ పార్కింగ్ సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రజా రవాణాను మరింత బలోపేతం చేయడానికి ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రాన్ని సీఐయూఆర్, పీఐయూఆర్, ఆర్ఏఆర్‌ఈ ప్రాంతాలుగా విభజించి అభివృద్ధి ప్రణాళికలు రూపొందించామని

మిగతా 2వ పేజీలో

## కరీంనగర్ బంద్ ఉద్రిక్తం

**గంగుల కమలాకర్ అరెస్ట్**

- క్యాంప్ కార్యాలయంపై దాడికి నిరసన
- ఇంటి వద్ద నుంచే మాజీ మంత్రిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- పలువురు బీఆర్ఎస్ నేతల అరెస్టు

3లో



## డ్రైవింగ్ లైసెన్స్ సేవలు పూర్తిగా ఆన్‌లైన్

- 17 రకాల సేవలకు ఫేస్‌లెస్ విధానం
- ఇంటి నుంచే సేవలు అవకాశం
- తెలంగాణ వాహనదారులకు భారీ ఊరట

2లో



వేద న్యూస్



## 'పాలమూరు-రంగారెడ్డి'పై
# ఉద్యమిస్తాం

- దసరాలోపు పనులు ప్రారంభించకపోతే పాదయాత్ర తప్పదు
- సాగునీటి సాధన కోసం టీఆర్ఎస్ పోరాడుతుంది
- అధికారంలోకి వస్తే మహిళలు, యువతకు పెట్టుబడి సహాయం
- తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత



**వేద న్యూస్, షాద్‌నగర్**

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనుల్లో పురోగతి లేకపోవడంపై తెలంగాణ రక్షణ సేన తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. జోగులాంబ అమ్మవారి ఆశీస్సులతో పాలమూరు, రంగారెడ్డి ప్రాంత ప్రజలతో కలిసి సాగునీటి సాధన కోసం పోరాటానికి శ్రీకారం చుట్టినట్లు కల్వకుంట్ల కవిత తెలిపారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని చౌదరిగూడెం మండలం లక్ష్మీదేవిపల్లిలో నిర్వహించిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు సాధన సభలో నేతలు మాట్లాడారు. కృష్ణానది సమీపంలో ప్రవహిస్తున్నప్పటికీ ఆ నీటిని వినియోగించుకునే అవకాశం లేకుండా పాలకులు వ్యవహరించారని విమర్శించారు. సాగునీటి హక్కుల కోసం ప్రజలతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం భారీగా నిధులు ఖర్చు చేసినప్పటికీ రైతులకు ఆశించిన స్థాయిలో నీరు అందలేదని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్ల పాలనలో కూడా ప్రాజెక్టు పనుల్లో ఎలాంటి పురోగతి చూపలేదని మండిపడ్డారు. పాలమూరు ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని ఇక సహించబోమని తెలిపారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులను దసరా పండుగలోపు ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వానికి గడువు విధించారు. ఆలోపు పనులు ప్రారంభించకపోతే ప్రాజెక్టు పరిధిలో విస్తృత పాదయాత్ర చేపట్టి ప్రభుత్వం చేసిన ద్రోహాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ, టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే మహిళలు, యువత స్వయం ఉపాధి రంగంలో ముందుకు రావడానికి పెట్టుబడి సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. చిన్న వ్యాపారాలు, ఉపాధి అవకాశాలకు ప్రోత్సాహం కల్పించి ఆర్థికంగా బలోపేతం చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. సభలో పలువురు నాయకులు, రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. సాగునీటి సమస్య పరిష్కారం వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు.

## డ్రైవింగ్ లైసెన్స్ సేవలు
# పూర్తిగా ఆన్‌లైన్



**వేద న్యూస్, హైదరాబాద్**

తెలంగాణలో వాహనదారులకు రాష్ట్ర రవాణా శాఖ భారీ ఊరట కల్పించింది. డ్రైవింగ్ లైసెన్స్‌కు సంబంధించిన 17 రకాల సేవలను పూర్తిగా ఆన్‌లైన్‌లోకి తీసుకొస్తూ 'ఫేస్‌లెస్' విధానాన్ని ప్రారంభించింది. ఇకపై చిన్నచిన్న పనుల కోసం ఆర్టీవో కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని అధికారులు తెలిపారు. రవాణా శాఖ కమిషనర్ డాక్టర్ కె ఇలంబర్తి మాట్లాడుతూ ఆధార్ ధ్రువీకరణ ద్వారా ఇంటి నుంచే ఈ సేవలను పొందవచ్చని వెల్లడించారు. పారదర్శకత పెంపు, సేవలను వేగవంతం చేయడమే ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. ఈ కొత్త విధానం ద్వారా లెర్నర్ లైసెన్స్‌లో పేరు, చిరునామా, ఫొటో, సంతకం మార్పులు, డూప్లికేట్ లెర్నర్ లైసెన్స్ జారీ వంటి సేవలను సులభంగా పొందవచ్చు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ రెన్యూవల్, డూప్లికేట్ లైసెన్స్, పుట్టిన తేదీ మార్పు, బయోమెట్రిక్ వివరాల సవరణ వంటి కీలక సేవలను కూడా ఫేస్‌లెస్ పద్ధతిలో అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రమాదకర వ్యర్థాల రవాణాకు అవసరమైన హజార్డస్ లైసెన్స్ ఎండార్స్‌మెంట్, డూప్లికేట్ పీఎస్‌వీ బ్యాడ్జ్ జారీ, లైసెన్స్ నుంచి వాహన విభాగాల తొలగింపు వంటి సేవలు కూడా ఆన్‌లైన్‌లో అందనున్నాయి. ఈ సేవలను పొందడానికి పౌరులు అధికారిక 'సారథి' వెబ్‌సైట్‌ను వినియోగించుకోవాలని సూచించారు. రాష్ట్రంలో డిజిటల్ పాలనను మరింత బలోపేతం చేయడంలో భాగంగానే ఈ ఫేస్‌లెస్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మధ్యవర్తుల ప్రమేయాన్ని తగ్గించి ప్రజలకు పారదర్శక సేవలు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ప్రస్తుతం వెబ్‌సైట్ ద్వారా అందుబాటులో ఉన్న ఈ సేవలను త్వరలోనే 'నెక్స్ట్‌జెన్ ఎం-పరివాహన్' మొబైల్ యాప్‌లో కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు కమిషనర్ వెల్లడించారు. ఈ మార్పులతో ప్రజలకు సమయం, శ్రమ ఆదా అవుతుందని రవాణా శాఖ తెలిపింది.

# బండికి సన్ స్ట్రోక్!

## కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కొడుకు సాయి భగీరథ్‌పై పోక్సో కేసు


### మద్యం తాగించి మైనర్ బాలికపై అత్యాచారం చేసినట్లు ఆరోపణలు

- హైదరాబాద్ పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో అర్ధరాత్రి హైడ్రామా
- మొదట కేసు పెట్టేందుకు పోలీసుల నిరాకరణ..
- బాధితుల ఆందోళనతో వెనక్కి..
- హనీట్రాప్ చేసి బ్లాక్ మెయిల్ చేస్తున్నారంటున్న సంజయ్ కొడుకు
- కరీంనగర్‌లో భగీరథ్ ఎదురు ఫిర్యాదు
- గతంలోనే 50 వేలు చెల్లించానన్న కేంద్ర మంత్రి కుమారుడు
- సోషల్ మీడియాలో నెటిజన్ల ప్రశ్నల వర్షం.. ఫైర్
- గతంలోనూ యూనివర్సిటీలో ర్యాగింగ్ కేసులు
- సంజయ్ ను మంత్రి పదవి నుంచి తప్పించాలంటూ ఢిల్లీకి చేరిన ఫిర్యాదులు
- మోడీ రాష్ట్ర పర్యటన వేళ ఇమేజ్ డ్యామేజ్

**వేద న్యూస్, ఫోకస్ టీమ్**

తెలంగాణ రాజకీయాలు వేడెక్కాయి. ఒక వైపు కరీంనగర్లో బండి సంజయ్, పాడి కౌశిక్ రెడ్డి ఎపిసోడ్ కాస్త బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య రాష్ట్ర వ్యాప్తంగా వేడి రగులుస్తుంటే.. మరోవైపు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తనయుడు సాయి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ప్రధాని నరేంద్ర మోడీ భాగ్యనగర పర్యటనకు సిద్ధమవుతున్న తరుణంలో, కేంద్ర హోంశాఖలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న సహాయ మంత్రి కుమారుడే మైనర్ బాలికపై అత్యాచారం చేశారన్న ఆరోపణలు రావడంతో.. ఇది కేవలం ఒక నేరపూరిత ఉదంతంగానే కాకుండా, బండి సంజయ్ రాజకీయ భవిష్యత్తును శాసించే పెను సంక్షోభంగా మారింది.





### అసలేం జరిగింది?

శుక్రవారం అర్ధరాత్రి హైదరాబాద్‌లోని పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ ఒక 17 ఏళ్ల మైనర్ బాలిక తల్లిదండ్రులు తమ కూతురిపై బండి సాయి భగీరథ్ అత్యాచారం చేశాడంటూ ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. బాలికకు బలవంతంగా మద్యం తాగించి, మొయినాబాద్‌లోని ఒక ఫామ్‌హౌస్‌లో ఈ దారుణానికి ఒడిగట్టినట్లు బాధితురాలి తరపు వారు ఆరోపించారు. కేంద్ర మంత్రి కొడుకు కావడంతో తొలుత కేసు నమోదుకు వెనుకాడిన పోలీసులు, బాధితులు కోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించడంతో చేసేది లేక పోక్సో చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ లోపే సదరు బాలిక రెండుసార్లు ఆత్మహత్యకు యత్నించిందన్న వార్త సోషల్ మీడియాలో వైరల్ అయింది.

### ముందస్తు స్కెచ్‌గా 'హనీట్రాప్' ఫిర్యాదు?

పేట్‌బషీరాబాద్‌లో రేప్ కేసు నమోదు కావడానికి సరిగ్గా కొన్ని గంటల ముందే, సాయి భగీరథ్ కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఒక ఫిర్యాదు చేయడం ఇప్పుడు అనేక అనుమానాలకు తావిస్తోంది. తనను ఒక యువతి, ఆమె తల్లిదండ్రులు హనీట్రాప్‌లోకి దించి బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఆయన అందులో పేర్కొన్నారు. అమ్మాయితో స్నేహం ఉన్న మాట నిజమేనని, కానీ దానిని అడ్డుపెట్టుకుని ఆమె తల్లిదండ్రులు తనను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి తెచ్చారని, లేదంటే రూ. 5 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారని భగీరథ్ తన రాతపూర్వక ఫిర్యాదులో వివరించాడు. భయపడి గతంలోనే రూ. 50 వేలు చెల్లించానని చెప్పడం గమనార్హం.

### డబ్బుల చెల్లింపు.. నేరానికి అంగీకారమేనా?

ఈ కేసులో ప్రధానంగా చర్చకు వస్తున్న అంశం.. అసలు తప్పు చేయనప్పుడు భగీరథ్ సదరు కుటుంబానికి ఎందుకు డబ్బు చెల్లించారు? అనేది. హనీట్రాప్ బాధితుడిగా చెప్పుకుంటున్న భగీరథ్, బ్లాక్ మెయిలింగ్ మొదలైనప్పుడే పోలీసులను ఆశ్రయించకుండా రహస్యంగా డబ్బు ఇవ్వడం వెనుక అసలు రహస్యం ఏంటని రాజకీయ విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. రేప్ కేసు పెడతారనే భయంతోనే రాజీ కోసం ప్రయత్నించారా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు, బాధితురాలి తల్లిదండ్రులు మాత్రం తమ బిడ్డకు న్యాయం చేయాలని, మంత్రి హోదాతో కేడర్‌ను, పోలీసులను ప్రభావితం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ప్రధాని మోదీ రాకవేళ 'బండి' ఇమేజ్ డ్యామేజ్

ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటనకు వస్తున్న సమయంలో ఈ వార్త వెలుగు చూడటం బండి సంజయ్‌ను తీవ్ర ఇరకాటంలోకి నెట్టింది. తెలంగాణలో బీజేపీని బలోపేతం చేయాలన్న లక్ష్యంతో ఉన్న అధిష్టానం, కీలక నేత తనయుడి ప్రవర్తన వల్ల పార్టీకి జరగబోయే నష్టాన్ని లెక్కగడుతోంది. గతంలో మహీంద్రా యూనివర్సిటీలో ఒక విద్యార్థిని కొట్టిన వీడియో వైరల్ అయినప్పుడే భగీరథ్ తీరుపై విమర్శలు వచ్చాయి. ఇప్పుడు ఏకంగా పోక్సో కేసు నమోదు కావడంతో.. మహిళల భద్రతకు పెద్దపీట వేస్తామనే బీజేపీకి ఇది నైతికంగా పెద్ద దెబ్బ. బండి సంజయ్‌ను కేంద్ర మంత్రి పదవి నుంచి తప్పించాలని ఇప్పటికే సోషల్ మీడియాలో 'జస్టిస్ ఫర్ మైనర్' పేరుతో ఉద్యమం మొదలైంది.

### రాజకీయ కోణంలో బీజేపీ అంతర్గత పోరు?

ఈ కేసు వెనుక బండి సంజయ్ వ్యతిరేక వర్గం హస్తం ఉందన్న ప్రచారం కూడా బీజేపీ వర్గాల్లో జోరుగా సాగుతోంది. రాష్ట్రంలో బండి ప్రాభవాన్ని తగ్గించడానికి ప్రత్యర్థి పార్టీల కంటే సొంత పార్టీలోని ప్రత్యర్థులే ఈ విషయాన్ని ఢిల్లీ పెద్దల దృష్టికి వేగంగా తీసుకెళ్తున్నట్లు సమాచారం. హోంశాఖ సహాయ మంత్రిగా ఉంటూ శాంతిభద్రతల గురించి మాట్లాడే బండి, తన ఇంట్లోనే ఇలాంటి పరిస్థితి ఉండటంపై ఢిల్లీ పెద్దలు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది.

# తమిళ పీఠంపై తళపతి

- సీఎంగా నేడు విజయ్ ప్రమాణ స్వీకారం
- టీవీకేకు 120 మంది సభ్యుల మద్దతు
- ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్
- రాష్ట్రవ్యాప్తంగా అభిమానుల సంబరాలు



**వేద న్యూస్, నేషనల్ బ్యూరో**

తమిళ రాజకీయాల్లో కొద్దిరోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. నటుడు, తమిళగ వెట్రి కళగం పార్టీ అధినేత విజయ్ తమిళనాడు నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసేందుకు మార్గం సుగమమైంది. రేపు మధ్యాహ్నం 3 గంటలకు చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈరోజు జరిగిన కీలక రాజకీయ పరిణామాల మధ్య విజయ్ చెన్నైలోని లోక్ భవన్‌లో ఇన్‌చార్జ్ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ను కలిశారు. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 120 మంది సభ్యుల మద్దతు తనకు ఉందని పేర్కొంటూ సంబంధిత మద్దతు లేఖలను గవర్నర్‌కు సమర్పించారు. విజయ్‌తో సమావేశం కోసం గవర్నర్ తన కేరళ పర్యటనను రద్దు చేసుకోవడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత విజయ్ గవర్నర్‌ను కలవడం ఇది నాలుగోసారి కావడం గమనార్హం. తమిళనాడు అసెంబ్లీలో మొత్తం 234 స్థానాలు ఉండగా ప్రభుత్వ ఏర్పాటుకు 118 మంది సభ్యుల మద్దతు అవసరం. ప్రస్తుతం టీవీకే బలం 120కి చేరడంతో విజయ్ ముఖ్యమంత్రి కావడం ఖాయమైంది. ఇవాళ వీసీకే, ఐయూఎంఎల్ పార్టీలు కూడా టీవీకేకు మద్దతు ప్రకటించాయి. విజయ్ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించనున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా టీవీకే శ్రేణులు, అభిమానులు సంబరాల్లో మునిగిపోయారు. పలుచోట్ల బాణసంచా కాలుస్తూ, స్వీట్లు పంచుకుంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ రంగంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే విజయ్ ముఖ్యమంత్రి స్థాయికి చేరుకోవడం తమిళ రాజకీయాల్లో పెద్ద చర్చగా మారింది. రేపటి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి.

# బీసీల కులగణనకు కేంద్రంపై ఒత్తిడి పెంచాలి

**వేద న్యూస్, హైదరాబాద్**

- బీసీలకు నిజమైన సామాజిక న్యాయం కులగణనతోనే సాధ్యం
- అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం
- హనుమంతరావు నిరాహార దీక్షకు టీఆర్పీ సంపూర్ణ మద్దతు

దేశవ్యాప్త జనగణనలో బీసీలకు ప్రత్యేకంగా కులవారీ గణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ మాజీ ఎంపీ, ప్రభుత్వ సలహాదారు వి హనుమంతరావు అంబర్‌పేటలోని తన నివాసంలో చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న స్వయంగా హనుమంతరావును కలిసి దీక్షకు పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ బీసీలకు నిజమైన సామాజిక న్యాయం అందాలంటే కులగణన అత్యంత కీలకమని పేర్కొన్నారు. దేశంలో బీసీలు పెద్ద సంఖ్యలో ఉన్నప్పటికీ వారి జనాభా, సామాజిక, ఆర్థిక పరిస్థితులపై సరైన గణాంకాలు లేకపోవడం వల్ల సంక్షేమ పథకాలు సమర్థంగా అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల జనాభా ఎంత ఉందో ఖచ్చితమైన లెక్కలు లేకుండా రిజర్వేషన్లు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు సరైన రీతిలో అమలు చేయడం అసాధ్యమని తీన్మార్ మల్లన్న అన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే బీసీల కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. సామాజిక న్యాయం పేరుతో మాట్లాడే ప్రభుత్వాలు బీసీల వాస్తవ పరిస్థితులను గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఎప్పటికప్పుడు బీసీల సమస్యలపై స్పందిస్తూ వారి హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తోందని తెలిపారు. రాష్ట్ర జనాభాలో బీసీల వాటా గణనీయంగా ఉన్నప్పటికీ అధికారిక డేటా లేకపోవడం వల్ల అభివృద్ధి అవకాశాలు తగ్గుతున్నాయని విమర్శించారు. హనుమంతరావు చేపట్టిన ఈ ఆమరణ నిరాహార దీక్ష సాధారణ నిరసన కాదని, బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభ్యున్నతి కోసం జరుగుతున్న చారిత్రక పోరాటమని తీన్మార్ మల్లన్న అభివర్ణించారు. బీసీల సమస్యలను జాతీయ స్థాయిలో చర్చకు తీసుకువచ్చే ఉద్యమంగా ఇది మారాలని ఆకాంక్షించారు. జనగణనలో బీసీల కులగణనను వెంటనే చేర్చాలని, బీసీల జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీలకు విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని తీన్మార్ మల్లన్న డిమాండ్ చేశారు. బీసీలకు సంబంధించిన డేటా లేకపోవడం వల్ల అనేక వర్గాలు అభివృద్ధికి దూరమవుతున్నాయని పేర్కొన్నారు. అవసరమైతే ఈ అంశంపై రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడతామని ఆయన హెచ్చరించారు. బీసీల హక్కుల సాధన కోసం తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఎలాంటి పోరాటానికైనా సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. హనుమంతరావు చేస్తున్న పోరాటం ప్రశంసనీయమని పేర్కొంటూ, బీసీల భవిష్యత్తు కోసం సమాజంలోని ప్రతి వర్గం మద్దతు ఇవ్వాలని కోరారు. బీసీల అభ్యున్నతి కోసం ఉద్యమం మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీసీ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. హనుమంతరావు దీక్ష విజయవంతం అయ్యే వరకు అన్ని విధాలా అండగా ఉంటామని ప్రకటించారు.



# ట్రాఫిక్ ఫ్రీ హైదరాబాదే లక్ష్యం

**మొదటి పేజీ తరువాయి**

ముఖ్యమంత్రి వివరించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతాన్ని సర్వీస్ సెక్టార్‌గా, రీజనల్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతాన్ని తయారీ రంగ అభివృద్ధికి అనుకూల ప్రాంతంగా, ఆ తర్వాతి గ్రామీణ ప్రాంతాలను వ్యవసాయ ఆధారిత ఆర్థిక మండలాలుగా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టు ద్వారా హైదరాబాద్‌ను కాలుష్య సమస్యల నుంచి కాపాడటంతో పాటు నగర సంస్కృతితో అనుసంధానం చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సీఎం తెలిపారు. నగరంలో ఈవీ బస్సులను ప్రవేశపెట్టడమే కాకుండా ఆటోలను ఉచితంగా ఈవీ వాహనాలుగా మార్చే కార్యక్రమాన్ని కూడా చేపట్టనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో హైదరాబాద్ తాగునీటి సరఫరా, పట్టణాభివృద్ధి, మూసీ పునరుజ్జీవం వంటి అంశాలపై ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు దేశంలోనే విప్లవాత్మక కార్యక్రమమని స్టాండింగ్ కమిటీ సభ్యులు అభిప్రాయపడ్డారు. తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్‌ను కమిటీ సభ్యులకు ముఖ్యమంత్రి అందజేశారు.

# గంగుల కమలాకర్ అరెస్ట్



- మాజీ మంత్రి ఇంటివద్ద ఉద్రిక్తత
- బీజేపీ, బండి సంజయ్‌కు వ్యతిరేకంగా నినాదాలు
- దాదాపు వందమంది కార్యకర్తలు అదుపులోకి..

**వేద న్యూస్, కరీంనగర్ :**

కరీంనగర్‌లో రాజకీయ ఉద్రిక్తత మరింత ముదిరింది. నగర బంద్ పిలుపు నేపథ్యంలో మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ను పోలీసులు శుక్రవారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. గంగుల నివాసం వద్ద భారీగా పోలీసులు మోహరించి ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. గంగుల కమలాకర్‌ను పోలీసులు అరెస్ట్ చేయడంతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని నిరసన తెలిపారు. బీజేపీ డౌన్ డౌన్.. బండి సంజయ్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. పోలీసులు అనవసరంగా దౌర్జన్యానికి దిగుతున్నారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. మహిళా కార్యకర్తలను లేడీ పోలీసుల్లేకుండానే అదుపులోకి తీసుకున్నారంటూ బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ క్రమంలో పోలీసులకు, కార్యకర్తలకు మధ్య తోపులాట చోటుచేసుకుని పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అదనపు బలగాలను రంగంలోకి దించిన పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

# వైద్యం వికటించి మహిళ మృతి

- డాక్టర్ల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువుల ఆందోళన
- యశోదకృష్ణ ఆసుపత్రి ఎదుట ఉద్రిక్తత



**వేద న్యూస్, కరీంనగర్:**

కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో శస్త్రచికిత్స అనంతరం మహిళ మృతి చెందడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వైద్యుల నిర్లక్ష్యం వల్లే మరణం సంభవించిందని ఆరోపిస్తూ బాధితురాలి కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. నగరంలోని యశోదకృష్ణ ఆసుపత్రి లో బెదరకోట చంద్రకళ గర్భసంచి సమస్యతో చికిత్స కోసం చేరారు. గురువారం ఆమెకు శస్త్రచికిత్స నిర్వహించగా, శుక్రవారం సాయంత్రానికి ఆరోగ్యం విషమించి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆపరేషన్ వికటించడం వల్లే చంద్రకళ ప్రాణాలు కోల్పోయారని ఆరోపించిన బంధువులు, వైద్యుల నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆసుపత్రి ఎదుట బైఠాయించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆసుపత్రి వద్దకు చేరుకుని భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు.

# రాజన్న క్షేత్రంలో మరో అద్భుత విగ్రహం

- మినీ ట్యాంక్ బండ్ పనులు శరవేగంగా పూర్తి
- ప్రత్యేక ఆకర్షణగా భారీ శివుడి విగ్రహం



**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**

దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ రాజన్న క్షేత్రంలో మరో ఆధ్యాత్మిక ఆకర్షణ రూపుదిద్దుకుంటోంది. భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు ఆహ్లాదకర వాతావరణం కల్పించే లక్ష్యంతో చేపట్టిన మినీ ట్యాంక్ బండ్ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ ప్రాజెక్టులో ప్రధాన ఆకర్షణగా భారీ శివుడి విగ్రహం నిలవనుంది. కళాత్మకంగా నిర్మిస్తున్న ఈ విగ్రహం ఇప్పటికే జిల్లా ప్రజల దృష్టిని ఆకర్షిస్తోంది. ధ్యాన ముద్రలో ఉన్న శివుడి రూపం పూర్తయితే వేములవాడకు మరో ప్రత్యేక గుర్తింపుగా నిలవనుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. చెరువు గట్టు వెంట వాకింగ్ ట్రాక్, పచ్చదనం, భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు బెంచీలు ఏర్పాటు చేస్తున్నారు. రాత్రి వేళల్లో విద్యుత్ కాంతుల నడుమ శివుడి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. పనులు పూర్తయిన తర్వాత రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు ఇది మరో ముఖ్య పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా మారనుందని అధికారులు భావిస్తున్నారు.

# ఉచిత యోగ శిక్షణ తరగతులు ప్రారంభం

- మే 11 నుంచి ఆగస్టు 10 వరకు నిర్వహణ
- ఉదయం, సాయంత్రం ప్రత్యేక యోగ సెషన్లు



**వేద న్యూస్, మందమర్రి:**

మందమర్రి ఏరియాలోని సింగరేణి పాఠశాల మైదానంలో సీనియర్ సిటిజన్లు, రిటైర్డ్ కార్మికులు, ప్రజల కోసం ఉచిత యోగఆరోగ్య శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు తెలిపారు. శనివారం నిర్వహించిన యోగ పరిచయ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 11 నుంచి ఆగస్టు 10 వరకు ప్రతిరోజూ ఉదయం 6 నుంచి 7 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు యోగ తరగతులు జరుగుతాయని చెప్పారు. యోగ సాధన ద్వారా గుండె జబ్బులు, బీపీ, షుగర్, మోకాళ్ల నొప్పులు వంటి సమస్యలను నియంత్రించుకోవచ్చని పేర్కొన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి యోగను జీవన విధానంగా అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యోగ శిక్షకులు కొంపల్లి రమేష్, బర్ల సదానందం, మద్ది శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# లింగాలగడ్డ త్రికుటాలయ విలాపం!

- శిథిలాల మధ్య మౌనంగా నిలిచిన కాకతీయ కళా వైభవం
- గుప్తనిధుల వేటతో మరింత ధ్వంసమైన పురాతన క్షేత్రం
- సంస్కృతిని కాపాడాలంటూ వేడుకుంటున్న చారిత్రక ఆలయం
- వారసత్వ పరిరక్షణపై అధికారుల నిర్లక్ష్యంపై ఆవేదన






**వేద న్యూస్, నల్లబెల్లి :**

నల్లబెల్లి మండలం బజ్జు తండాలోని లింగాలగడ్డ త్రికుటాలయం ప్రస్తుతం శిథిలావస్థలో విలవిలలాడుతోంది. కాకతీయుల కాలంలో నిర్మించబడిన ఈ పురాతన ఆలయం నిర్లక్ష్యానికి గురై చరిత్రలో కలిసిపోతున్న దుస్థితి భక్తులను కలచివేస్తోంది. మూడు శివలింగాలు, మూడు ఉపాలయాలతో వెలసిన ఈ ఆధ్యాత్మిక క్షేత్రం నేడు మట్టి దిబ్బల మధ్య కూలిపోయి కనిపిస్తోంది. గుప్తనిధుల కోసం వచ్చిన దుండగులు ఆలయ నిర్మాణాన్ని ధ్వంసం చేసినట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు శిల్ప కళా వైభవంతో వెలుగొందిన ఆలయం నేడు రక్షణ లేక శిథిలాలుగా మారడం బాధాకరమని గ్రామస్తులు అంటున్నారు. శివలింగాలు మట్టిలో పడి ఉండడం చూసి భక్తులు కన్నీటి పర్యంతమవుతున్నారు. కొత్త ఆలయాలు కట్టకపోయినా పర్వాలేదు.. కానీ పూర్వీకుల వారసత్వాన్ని కాపాడాలి అని స్థానికులు కోరుతు న్నారు. చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఈ ఆలయాన్ని ప్రభుత్వం గుర్తించి సంరక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

- షేక్ తస్లీమ్ వివాహానికి రూ.5 వేల అందజేత



**వేద న్యూస్, రుద్రూర్ :**

రుద్రూర్ మండలంలోని అంబం (ఆర్) గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం షేక్ అహ్మద్ కుమార్తె షేక్ తస్లీమ్ వివాహానికి బీఆర్ఎస్ నాయకుడు కొత్తపల్లి రవి కిరణ్ శనివారం రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబానికి అండగా ఉంటామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సిరిగారి శేఖర్, శానం పోశెట్టి, షేక్ ఖదీర్, ల్యాబ్ శేఖర్, సాయిరాం, వెంకటేశం, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

ఆదివారం మే 10, 2026

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి
- కొనుగోలు, రవాణా ప్రక్రియపై సమీక్షించిన కలెక్టర్ కుమార్ దీపక్



**వేద న్యూస్, మంచిర్యాల :**

జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. శనివారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో నిర్వహించిన మంచిర్యాల నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల నుంచి మద్దతు ధరకు నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేస్తోందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో నాణ్యత, తేమ శాతం పరిశీలించి రైతులకు టోకెన్లు అందజేయాలని సూచించారు. జిల్లాలో ప్రస్తుతం 12 రైస్ మిల్లులు పనిచేస్తున్నాయని, రోజుకు కనీసం 10 లారీల ధాన్యాన్ని అన్‌లోడ్ చేయాలని మిల్లర్లకు సూచించారు. ఇప్పటివరకు 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, ఈ నెలాఖరు నాటికి 80 శాతం కొనుగోళ్లు పూర్తి చేసే లక్ష్యంతో చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అకాల వర్షాల నేపథ్యంలో రైతుల ధాన్యం తడవకుండా గోదాముల్లో నిల్వ చేసే ఏర్పాట్లు చేస్తున్నామని, అవసరమైతే కొత్త గోదాములు గుర్తిస్తామని పేర్కొన్నారు. రవాణా, హమాలీల కొరత లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, అదనపు కలెక్టర్లు పి. చంద్రయ్య, రాములు, మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, అధికారులు, రైస్ మిల్లర్లు, లారీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# దేవాలయానికి రూ.50,400 విరాళం

- పేరాల కృపాకర్ రావును అభినందించిన నిర్వాహకులు



**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

వేములపల్లి మండలం ఆమనగల్ గ్రామంలో శ్రీ తిరుపతమ్మ గోపయ్య స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఈ నెల 11న ఘనంగా నిర్వహించనున్న నేపథ్యంలో మాజీ సర్పంచ్ పేరాల కృపాకర్ రావు దేవాలయ నిర్మాణానికి రూ.50,400 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దేవాలయ నిర్మాణ కర్త ఎలగపల్లి లక్ష్మీ వెంకటేష్ ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. దేవాలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని కోరారు. అమ్మవారిని భక్తితో ప్రార్థిస్తే కోరిన కోరికలు నెరవేరుతాయని గ్రామస్థుల విశ్వాసమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ముండ్ల గంగయ్య, దండెం శ్రీను, దేవాలయ కమిటీ సభ్యులు చింతకాయల సైదులు, బంటు ఎల్లయ్య, వల్లంపట్ల వెంకన్న, దామెర్ల వెంకటయ్య, ఎలగపల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# అత్యంత వైభవోపేతంగా బొడ్రాయి పండుగ

- రిటైర్డ్ పోలీస్ అధికారి రామ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో..
- సొంతూరి ప్రజల క్షేమం కోసం తనవంతుగా కట్టంగూరి కృషి
- గ్రామ దేవతల పునఃప్రతిష్టాపన మహోత్సవంలో పెద్ద ఎత్తున పాల్గొన్న ప్రజలు
- సంప్రదాయ బద్ధంగా పూజలు



**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం ఆకినపల్లి గ్రామంలో భూలక్ష్మి మహాలక్ష్మి బొడ్రాయి ప్రతిష్టాపన మహోత్సవం అత్యంత వైభవోపేతంగా జరిగింది. సొంతూరి క్షేమం కోసం గ్రామ వాస్తవ్యులు, రిటైర్డ్ పోలీస్ అధికారి కట్టంగూరి రామ నర్సింహారెడ్డి సొంత ఖర్చుతో సుమారు రూ.30 లక్షలకు పైనే వెచ్చించి గ్రామదేవతల పున: ప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహించారని గ్రామస్తులు వెల్లడించారు. గ్రామంలో తొలిసారి బొడ్రాయి కార్యక్రమానికి కూడా సహకరించి.. ప్రస్తుతం రెండోసారి కూడా అత్యంత వైభవో పే తంగా కార్యక్రమాన్ని రామ నరసింహారెడ్డి నిర్వహించడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మహాలక్ష్మి భూలక్ష్మి బొడ్రాయి పండుగ సందర్భంగా శనివారం గ్రామంలో యువతీ యువకులు పెద్దలు పిల్లలు అందరూ గ్రామదేవతల వద్ద చక్కగా పూజలు నిర్వహించారు. ఆకినపల్లి బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు అందరూ కలిసి అత్యంత ఘనంగా బొడ్రాయి ప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహించుకున్నారు. గ్రామ దేవతల పునః ప్రతిష్టాపన మహోత్సవం తర్వాత దేవతలకు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా రామ నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. గ్రామదేవతల ఆశీస్సులతో గ్రామస్తులందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు , ఐశ్వర్యం కలగాలని ఆకాంక్షించారు. సంస్కృతి సంప్రదాయాలకు కట్టుబడి ఆధ్యాత్మిక మార్గంలో గ్రామస్తులు ముందుకు సాగాలని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి తన వంతుగా పాటుపడతానని హామీ ఇచ్చారు. ఈ బొడ్రాయి ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమంలో ఆకినపల్లి గ్రామ పెద్దలు ,పిల్లలు ,యువకులు, మహిళలు, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మోడీ సభను విజయవంతం చేయాలి

- తదుపరి లక్ష్యం తెలంగాణే : దినేష్ కులచారి
- బీజేపీ కార్యాలయంలో సన్నాహక సమావేశం



**వేద న్యూస్, రుద్రూర్:**

సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఆదివారం నిర్వహించనున్న ప్రధాని నరేంద్ర మోడీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారి పిలుపునిచ్చారు. శనివారం రుద్రూర్ మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో రుద్రూర్, పొతంగల్, వర్ని, కోటగిరి, మోస్రా, చింతకుంట మండలాల నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దినేష్ కులచారి మాట్లాడుతూ.. దేశ ప్రజలందరినీ కుటుంబ సభ్యుల్లా భావిస్తూ సేవలందిస్తున్న నాయకుడు ప్రధాని మోడీ అని పేర్కొన్నారు. బీజేపీ తదుపరి లక్ష్యం తెలంగాణేనని, వచ్చే ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి వస్తుందనే విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు కందగట్ల రామచందర్, ఎన్‌ఆర్‌ఐ కోనేరు శశాంక్, ప్రశాంత్ గౌడ్, ఆలపాటి హరికృష్ణ, ఆవుల రమేష్, భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కంఠ మహేశ్వరుని ఉత్సవాలు

- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న గౌడ సంఘం నాయకులు



**వేద న్యూస్, నల్లబెల్లి :**

నల్లబెల్లి మండలం బొల్లోనిపల్లి (అర్షనపల్లి)లో శ్రీ కంఠ మహేశ్వరుని ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. శనివారం శ్రీ కంఠ మహేశ్వర స్వామి, సూరమాంబ దేవి, రేణుక ఎల్లమ్మ, వనం మైసమ్మ, పోతారాజు విగ్రహాల ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మోకుదెబ్బ అనంతుల రమేష్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు గోపగాని వెంకట్ గౌడ్ హాజరయ్యారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం ఆలయాన్ని మామిడి తోరణాలతో అలంకరించగా, గౌడ సభ్యులకు మాలధారణ కార్యక్రమం నిర్వహించారు. విగ్రహ దాతలు తిప్పని యశోద, సాయిలు గౌడ్ దంపతుల జ్ఞాపకార్థంగా వారి కుటుంబ సభ్యులు ఉత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొని ఉత్సవాలకు ప్రత్యేక శోభ తీసుకువచ్చారు.

# ఎన్‌డీఏ పరీక్షలో మెరిసిన రుక్మాపూర్ సైనిక్ విద్యార్థులు

- ముగ్గురు కాడెట్స్‌కు ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూకు ఎంపిక
- విద్యార్థులను అభినందించిన పాఠశాల యాజమాన్యం







**వేద న్యూస్, చొప్పదండి :**

చొప్పదండి మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక్ స్కూల్, రుక్మాపూర్‌కు చెందిన కాడెట్స్ కె. నరేష్, ఆర్. సాయికుమార్, డి. అభినవ్ రెడ్డి గత నెల నిర్వహించిన ఎన్‌డీఏ ప్రవేశ రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. వీరు త్వరలో జరిగే ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ బోర్డుకు ఎంపికయ్యారు. ఇంటర్మీడియేట్ 2024-26 బ్యాచ్‌కు చెందిన కె. నరేష్‌తో పాటు, 2023-25 బ్యాచ్ విద్యార్థులు ఆర్. సాయికుమార్, డి. అభినవ్ రెడ్డి ఈ విజయాన్ని సాధించారు. గురువుల ప్రోత్సాహం, కృషి వల్లే ఈ స్థాయికి చేరుకున్నామని విద్యార్థులు తెలిపారు. పాఠశాల డైరెక్టర్ కర్నల్ రాజా దత్త, ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల విజయం ఇతర కాడెట్స్‌కు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, కోచ్‌లు, సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

వేద న్యూస్

ఆదివారం మే 10, 2026

# అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత

**– ట్రాక్టర్ స్వాధీనం చేసుకున్న అటవీ అధికారులు**

**వేద న్యూస్, శాయంపేట :**



శాయంపేట మండలం పత్తిపాక గ్రామంలో అక్రమంగా కలప తరలిస్తున్న ట్రాక్టర్‌ను అటవీ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. డిప్యూటీ రేంజర్ వై. కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా పరకాలకు చెందిన సామిల్లు యజమాని సాంబయ్య, వేప కలపతో కూడిన ట్రాక్టర్‌ను నీరుకుల్ల గ్రామం నుంచి పత్తిపాక స్టోన్ క్రషర్ రోడ్డుమీదుగా తరలిస్తుండగా సమాచారం అందింది. ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ సభ్యుడు మారపెల్లి సునీల్, పర్యావరణ ప్రేమికుడు ధైనంపెల్లి నాగరాజు ఇచ్చిన సమాచారంతో అటవీ అధికారులు ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేశారు. అనంతరం ట్రాక్టర్‌ను ఫారెస్ట్ కార్యాలయానికి తరలించారు. సమాచారం అందించి సహకరించిన ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ సభ్యుల ధైర్యసాహసాలను డిప్యూటీ రేంజర్ అభినందించారు.

# రైతులు ఆందోళన చెందొద్దు

**– తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తాం**

**– ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**



**వేద న్యూస్, గంగాధర :**

చొప్పదండి నియోజకవర్గంలోని కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చిన రైతులు ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భరోసా ఇచ్చారు. గంగాధర మండలం మధురానగర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన తనిఖీ చేసి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీపీఎస్ విధానం కారణంగా కొనుగోళ్లు వారం రోజుల పాటు ఆలస్యమయ్యాయని చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో అధిక తూకాలు వేస్తున్నారనే ఫిర్యాదులు వచ్చాయని, నిబంధనల ప్రకారమే ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. మిల్లర్లు కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే తీసుకెళ్లకపోతే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా కలెక్టర్, అధికారులతో నిరంతరం సమన్వయం చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు ఎదురైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలి

**– టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలి**

**– కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**వేద న్యూస్, సిరిసిల్ల :**


ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి సేకరించి తూకం వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. శనివారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడులో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలు, హమాలీల లభ్యత, ధాన్యం సేకరణ వివరాలను పరిశీలించారు. రైతులు ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకువచ్చిన వెంటనే జాప్యం లేకుండా తూకం వేయాలని, అందుకు తగిన సంఖ్యలో హమాలీలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. స్థానిక రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచాలని అధికారులకు ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు వాహనాల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ట్రాక్టర్ల ద్వారా కూడా ధాన్యం తరలించే అవకాశం ఉందని, మిల్లుల్లో బస్తాలు త్వరగా అన్‌లోడ్ అయ్యేలా పర్యవేక్షణ చేయాలని అధికారులను సూచించారు. తనిఖీలో జిల్లా పౌర సరఫరాల అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, సహకార శాఖ అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# లిఫ్ట్ ఇచ్చిన వ్యక్తి బైక్‌తో పరార్

**– దొంగిలించిన వాహనం స్వాధీనం**

**– నిందితుడికి రిమాండ్**

**వేద న్యూస్, కోనరావుపేట:**



లిఫ్ట్ ఇచ్చిన వ్యక్తి బైక్‌ను దొంగిలించి పరారైన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. కోనరావుపేట ఎస్సై ప్రశాంత్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ఏడాది జనవరి 25న వెంకట్రావుపేట గ్రామానికి చెందిన నాలుక శంకర్, అదే గ్రామానికి చెందిన సంధు సాయి కుమార్‌కు తన బైక్‌పై లిఫ్ట్ ఇచ్చాడు. వుసాయిపేటలోని ఓ మొబైల్ షాప్ వద్ద శంకర్ లోపలికి వెళ్లిన సమయంలో, సాయి కుమార్ హెచ్‌ఎఫ్ డీలక్స్ బైక్ (టీఎస్23డి 3211)ను దొంగిలించి పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు శనివారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దొంగిలించిన బైక్‌పై వేములవాడ వైపు వస్తున్న సాయి కుమార్‌ను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి సుమారు రూ.30 వేల విలువైన బైక్‌ను స్వాధీనం చేసుకుని, అతడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

# ప్రజా కళల పరిరక్షణకు ప్రజానాట్యమండలి



**– పాటిమీదగుంపులో 17 నుంచి 19 వరకు నిర్వహణ**

**వేద న్యూస్, కారేపల్లి :**

సింగరేణి మండలం పాటిమీదగుంపు గ్రామంలో ఈ నెల 17 నుంచి 19 వరకు నిర్వహించనున్న ప్రజానాట్యమండలి పాటల శిక్షణ శిబిరాన్ని ప్రజలు జయప్రదం చేయాలని సీపీఎం వైరా నియోజకవర్గ కార్యదర్శి భూక్య వీరభద్రం, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నామ లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) సింగరేణి మండల కమిటీ సమావేశం శనివారం ఎర్రబోడులో ఎండి ఇస్మాయిల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజా కళలను ప్రోత్సహించడం, ప్రత్యామ్నాయ సంస్కృతిని అభివృద్ధి చేయడంలో ప్రజానాట్యమండలి కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రజల సమస్యలను ప్రతిబింబించే కళారూపాలు సమాజానికి దిశానిర్దేశం చేస్తాయని, శ్రమజీవుల జీవన విధానం, కష్టాలు, పోరాటాలను ప్రజా కళల ద్వారానే సమాజానికి చేరవేయవచ్చని తెలిపారు. ప్రస్తుతం మతోన్మాద, పెట్టుబడిదారీ శక్తులు ప్రజా చరిత్రను వక్రీకరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు ఉపయోగపడే నిజమైన ప్రజా కళలను కాపాడి ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని, పాటిమీదగుంపులో నిర్వహించే శిక్షణ శిబిరానికి ప్రజలు హార్దికంగా, ఆర్థికంగా సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా, మండల నాయకులు, ప్రజానాట్యమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఉసిరికాయలపల్లిలో పారిశుధ్య పనులు

**వేద న్యూస్, కారేపల్లి :**



సింగరేణి మండలం ఉసిరికాయలపల్లి గ్రామంలో పారిశుధ్య పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. గ్రామ సర్పంచ్ గుగులోత్ వరలక్ష్మి రాజు చొరవతో గ్రామపంచాయతీ సిబ్బంది సమన్వయంతో చేపడుతున్న శుభ్రత కార్యక్రమాలు గ్రామ ప్రజల ప్రశంసలు అందుకుంటున్నాయి. గ్రామంలోని ప్రధాన రహదారులు, కాలనీలు, అంతర్గత వీధులు, డ్రైనేజీలను యుద్ధ ప్రాతిపదికన శుభ్రపరుస్తూ ఎక్కడా చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకుంటున్నారు. డ్రైనేజీల్లో మురుగు నిల్వ కాకుండా నిరంతర శుభ్రపరిచే పనులు చేపడుతుండగా, ఇంటింటికీ చెత్త సేకరణ కార్యక్రమాన్ని క్రమబద్ధంగా అమలు చేస్తున్నారు. పరిశుభ్రమైన గ్రామమే ఆరోగ్యకరమైన గ్రామానికి నిదర్శనమనే లక్ష్యంతో పారిశుధ్య పనులను సర్పంచ్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. గ్రామంలో శుభ్రత నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామ ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ గ్రామాభివృద్ధికి సహకరించాలని సర్పంచ్ వరలక్ష్మి రాజు కోరారు. పారిశుధ్య కార్యక్రమాలతో ఉసిరికాయలపల్లి ఆదర్శ గ్రామంగా రూపుదిద్దుకుంటోందని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు.

# పని హక్కును హరిస్తున్న మోడీ ప్రభుత్వం

**– కొత్త నిబంధనలతో ఉపాధి కూలీలకు ఇబ్బందులు**

**– ఉపాధి పనులను పరిశీలించిన వ్యవసాయ కార్మిక సంఘం నేతలు**



**వేద న్యూస్, కారేపల్లి :**

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రాజ్యాంగబద్ధమైన పని హక్కును హరిస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొండబోయిన నాగేశ్వరరావు విమర్శించారు. శనివారం కారేపల్లి మండలం ఎర్రబోడులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను వ్యవసాయ కార్మిక సంఘం (వ్యకాస) నేతలు సందర్శించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారాల తరబడి వేతనాలు అందడం లేదని, ఫోటో విధానం కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని కూలీలు తెలిపారు. అనంతరం సమస్యలు, డిమాండ్లతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. కొండబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించి కూలీల ఉపాధిని దూరం చేస్తోందన్నారు. రోజువారీ కూలీ రూ.307 రావాల్సి ఉండగా ప్రస్తుతం రూ.150 కూడా అందడం లేదని ఆరోపించారు. పని ప్రదేశాల్లో టెంట్లు, తాగునీరు, మెడికల్ కిట్లు వంటి కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. ఉపాధి పనులను 200 రోజులకు పెంచి రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని, సమ్మర్ అలవెన్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాద భీమా పథకం అమలు చేసి ప్రమాదాలకు గురైన కూలీలకు రూ.10 లక్షల పరిహారం అందించాలని కోరారు.

# రేపటి నుంచి జనగణన ప్రారంభం

**– సమాచారం గోప్యంగా ఉంచుతాం – తహశీల్దార్ రాజేశ్వరి**

**వేద న్యూస్, రామడుగు:**




కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 2027 జనాభా లెక్కల సేకరణలో భాగంగా గృహ గణన నమోదు ప్రక్రియ సోమవారం నుంచి మండలంలో ప్రారంభం కానుందని తహశీల్దార్ రాజేశ్వరి తెలిపారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ.. గ్రామాలకు వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలు సరైన సమాచారం అందించాలని, ఎలాంటి తప్పుడు వివరాలు ఇవ్వవద్దని కోరారు. సేకరించిన సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచబడుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాల రూపకల్పన, అమలులో జనగణన వివరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రజలు జనగణన అధికారులకు సహకరించి ప్రక్రియ విజయవంతం చేయాలని కోరారు.

# ప్రజాపాలన కార్యక్రమాలపై అధికారులకు దిశానిర్దేశం

- వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి
- ధాన్యం సేకరణ, జనగణనపై కీలక సూచనలు
- అగ్రి స్టాక్, రైతు రిజిస్ట్రీపై సమీక్ష



**వేద న్యూస్ హైదరాబాద్ :**

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజాపాలనప్రగతి ప్రణాళిక, విద్యాశాఖ వారోత్సవాలు, ధాన్యం సేకరణ, అగ్రి స్టాక్‌ఫార్మర్స్ రిజిస్ట్రీ, జనగణనసెల్ఫ్ ఎన్యుమరేషన్ తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ప్రజాపాలన కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యాశాఖ వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించడంతో పాటు ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకత పాటిస్తూ సకాలంలో ధాన్యం సేకరణ పూర్తి చేయాలని పేర్కొన్నారు. అగ్రి స్టాక్‌ఫార్మర్స్ రిజిస్ట్రీ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. రైతుల వివరాలను ఖచ్చితంగా నమోదు చేసి ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందేలా చూడాలని ఆదేశించారు. జనగణనలో భాగంగా సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. డిజిటల్ విధానాల వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ ఆర్ఎస్ చిత్రూ, వ్యవసాయ అధికారి శ్రీధర్ స్వామి, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ సుధారాణి, విద్యా, రవాణా, మార్కెటింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం

- 134వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భక్తుల సందడి
- మహా అన్నదానంతో ఆధ్యాత్మిక కాంతుల విరాజిల్లిన తోడితులగూడెం



**వేద న్యూస్, కారేపల్లి:**

సింగరేణి మండలం తోడితులగూడెం గ్రామంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీశ్రీశ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి 134వ వార్షిక కళ్యాణ మహోత్సవం, బ్రహ్మోత్సవాలు శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల నడుమ జరిగిన ఈ దివ్య కళ్యాణ వేడుకలకు భక్తులు భారీ సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని శేఖర్ రెడ్డి-శ్వేతా రెడ్డి దంపతులు కళ్యాణ పీఠంపై కూర్చొని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ పూజారుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిగిన ఈ మహోత్సవం భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో ముంచెత్తింది. ఇల్లందు, కొత్తగూడెం, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు, విద్యాసంస్థల యాజమాన్యాలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహోత్సవంలో భాగంగా నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తాగునీరు, రాకపోకలు, వాహన పార్కింగ్, ఆటో సౌకర్యాలు వంటి ఏర్పాట్లను నిర్వాహకులు సమర్థంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, సర్పంచ్‌లు, భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. మంగళవాయిద్యాలు, వేదఘోషల మధ్య జరిగిన ఈ కళ్యాణ మహోత్సవం తోడితులగూడెం గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపింది.

# అంగరంగ వైభవంగా హిందూ సమ్మేళనం

- వర్షకొండలో భారీగా తరలివచ్చిన భక్తులు
- సామూహిక కుంకుమార్చన, హనుమాన్ చాలీసాతో భక్తి పారవశ్యం



**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం :**

జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ గ్రామంలో హిందూ సమ్మేళన నిర్వహణ సమితి ఆధ్వర్యంలో హిందూ సమ్మేళన కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వర్షకొండ కూరగాయల మార్కెట్ వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమానికి యువకులు, మహిళలు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీమతి భార్గవి కళ్యాణి, ప్రధాన వక్తగా గోల్కొండ నాగరాజు హాజరయ్యారు. మహిళలు మంగళహారతులతో కార్యక్రమానికి తరలివచ్చి అర్చకులతో కలిసి గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సామూహిక కుంకుమార్చన, హనుమాన్ చాలీసా పారాయణం, సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ హిందూ ధర్మం, ఐక్యత, సంస్కృతి, సనాతన విలువలను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. భావితరాల్లో హిందూ జాగృతి కలిగించే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పిల్లలకు క్రమశిక్షణతో పాటు హిందూ మతంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ముఖ్య అతిథి భార్గవి కళ్యాణి మాట్లాడుతూ.. శ్రీరాముడి జీవన విధానాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని, రామాయణం చదివి జీవన విలువలను తెలుసుకోవాలని సూచించారు. యువత ధర్మం కోసం నిలబడాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో హిందూ బంధువులు కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ధార్మికవేత్తలు, సర్పంచ్ పొనుకంటి చిన్న వెంకట్, హిందూ సమ్మేళన అధ్యక్షుడు చెక్కిళ్ల దశగౌడ్, కుల సంఘాల ప్రతినిధులు, యువత పాల్గొన్నారు.

# కార్న్ ఫ్లోర్ వంటలకు కొత్త రుచి.. ఆరోగ్యంపై కూడా ప్రభావం

- ఫాస్ట్ ఫుడ్ వంటల్లో పెరుగుతున్న వినియోగం - కరకరలాడే రుచికి ప్రధాన కారణం
- అధిక వినియోగంపై నిపుణుల హెచ్చరిక



**వేద న్యూస్ డెస్క్:**

ప్రస్తుతం నగరాలు, పట్టణాల్లో ఫాస్ట్ ఫుడ్ సంస్కృతి పెరుగుతున్న నేపథ్యంలో కార్న్ ఫ్లోర్ వినియోగం కూడా భారీగా పెరుగుతోంది. హోటళ్లు, రెస్టారెంట్లు మాత్రమే కాకుండా ఇళ్లలో కూడా అనేక వంటకాల తయారీలో కార్న్ ఫ్లోర్‌ను విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. మొక్కజొన్న గింజలను ప్రత్యేక పద్ధతిలో పొడిచేసి తయారు చేసే ఈ పిండి వంటకాలకు ప్రత్యేకమైన రుచి, ఆకర్షణీయమైన రూపాన్ని అందిస్తుంది. ముఖ్యంగా పిల్లలు ఇష్టపడే ఫ్రై ఐటమ్స్‌లో కార్న్ ఫ్లోర్ వినియోగం ఎక్కువగా కనిపిస్తోంది. చికెన్ మంచూరియా, గోబీ మంచూరియా, ఫ్రెంచ్ ఫ్రైస్, పకోడీలు, స్ప్రింగ్ రోల్స్ వంటి వంటకాల తయారీలో కార్న్ ఫ్లోర్ కీలక పాత్ర పోషిస్తోంది. ఇతర పిండులతో పోలిస్తే ఇది వంటకాలపై పలుచని పొరలా ఏర్పడి కరకరలాడే టెక్స్చర్‌ను అందిస్తుంది. అందుకే హోటల్ స్టైల్ రుచి కోసం చాలామంది వంటల్లో కార్న్ ఫ్లోర్ కలుపుతున్నారు. సూపులు, గ్రేవీలు చిక్కగా తయారవ్వడానికి కూడా కార్న్ ఫ్లోర్ ఉపయోగపడుతుంది. తక్కువ పరిమాణంలో కలిపినా మంచి ఫలితం వస్తుండటంతో గృహిణులు దీనిని ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఇటీవల బేకరీ ఉత్పత్తులు, స్నాక్స్ తయారీలో కూడా కార్న్ ఫ్లోర్ వినియోగం పెరిగింది. కేకులు, బిస్కెట్లు, నూడుల్స్, పాస్తా వంటి పదార్థాల్లో కూడా ఇది భాగమవుతోంది. కొన్ని ప్రాంతాల్లో సంప్రదాయ వంటకాల తయారీలో కూడా కార్న్ ఫ్లోర్ ఉపయోగిస్తున్నారు. మార్కెట్‌లో తక్కువ ధరకు లభించడంతో మధ్యతరగతి కుటుంబాల్లో దీని వినియోగం మరింత పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు.

ఆరోగ్య పరంగా చూస్తే కార్న్ ఫ్లోర్‌లో గ్లూటెన్ ఉండదు. దీంతో గోధుమ పదార్థాలు తినలేని వారు దీనిని ప్రత్యామ్నాయంగా వినియోగిస్తున్నారు. కొంతమంది ఆరోగ్య నిపుణులు దీనిని పరిమిత మోతాదులో తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు. అయితే పూర్తిగా కార్న్ ఫ్లోర్ ఆధారిత ఆహారం తీసుకోవడం సరైన పద్ధతి కాదని హెచ్చరిస్తున్నారు. ఎందుకంటే ఇందులో ప్రోటీన్, ఫైబర్ శాతం తక్కువగా ఉండటంతో శరీరానికి అవసరమైన అన్ని పోషకాలు అందవని చెబుతున్నారు. అధికంగా కార్న్ ఫ్లోర్‌తో తయారయ్యే ఫాస్ట్ ఫుడ్ పదార్థాలు తీసుకోవడం వల్ల ఊబకాయం, జీర్ణ సమస్యలు వచ్చే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా నూనెలో వేయించిన పదార్థాలతో కలిపి తీసుకుంటే శరీరంలో కొవ్వు పెరిగే ప్రమాదం ఉంటుందని పేర్కొంటున్నారు. చిన్నపిల్లలకు తరచూ ఫ్రై ఐటమ్స్ ఇవ్వకుండా ఇంట్లో తయారుచేసిన ఆరోగ్యకరమైన ఆహారం అందించాలని సూచిస్తున్నారు. మరోవైపు వేసవి కాలంలో కార్న్ ఫ్లోర్‌తో తయారయ్యే చల్లటి వంటకాలకు కూడా డిమాండ్ పెరుగుతోంది. కొన్ని ప్రాంతాల్లో స్వీట్లు, పానీయాల్లో కూడా దీనిని ఉపయోగిస్తున్నారు. వంటకాలకు రుచి, ఆకర్షణ పెంచే కార్న్ ఫ్లోర్‌ను సరైన మోతాదులో వినియోగిస్తే ప్రయోజనకరమని నిపుణులు చెబుతున్నారు.



## జిలేబీ తినడం వల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటి?



- శరీరానికి తక్షణ శక్తిని అందించే తీపి పదార్థం
- మానసిక ఉల్లాసాన్ని పెంచే మిఠాయి
- మితంగా తీసుకుంటేనే ఆరోగ్యానికి మేలు

**వేద న్యూస్ డెస్క్:**

సంప్రదాయ భారతీయ తీపి వంటకాలలో జిలేబీ ప్రత్యేక గుర్తింపు పొందింది. తీపి రుచి, కరకరలాడే స్వభావంతో చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరినీ ఆకట్టుకునే ఈ మిఠాయి ఆరోగ్యపరంగా కూడా కొన్ని ప్రయోజనాలు కలిగిస్తుందని ఆహార నిపుణులు చెబుతున్నారు. అయితే దీనిని పరిమితంగా తీసుకోవడం ముఖ్యమని సూచిస్తున్నారు. జిలేబీలో చక్కెర శాతం అధికంగా ఉండటం వల్ల ఇది శరీరానికి తక్షణ శక్తిని అందిస్తుంది. ఎక్కువసేపు శారీరక శ్రమ చేసినవారు లేదా అలసటగా ఉన్నవారు కొద్దిపాటి జిలేబీ తీసుకుంటే శక్తి పెరిగిన భావన కలుగుతుందని చెబుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఉదయం పాలతో కలిసి జిలేబీ తీసుకునే అలవాటు ఇప్పటికీ కొనసాగుతోంది. తీపి పదార్థాలు మానసిక ఉల్లాసాన్ని పెంచడంలో కూడా సహాయపడతాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. జిలేబీ వంటి మిఠాయిలు తీసుకున్నప్పుడు మెదడులో ఆనంద భావనలు కలిగించే రసాయనాలు చురుకుగా పనిచేస్తాయని చెబుతున్నారు. అందువల్ల పండుగలు, శుభకార్యాల్లో జిలేబీకి ప్రత్యేక స్థానం ఉంది. అయితే అధికంగా జిలేబీ తీసుకోవడం ఆరోగ్యానికి హానికరమవుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇందులో తీపి, నూనె అధికంగా ఉండటంతో మధుమేహం, అధిక బరువు, గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు జాగ్రత్తగా తీసుకోవాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు ఎక్కువగా తినకుండా పెద్దలు పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. ఇంట్లో పరిశుభ్రంగా తయారు చేసిన జిలేబీ తీసుకోవడం మంచిదని ఆహార నిపుణులు సూచిస్తున్నారు. నాణ్యమైన నూనె, పరిశుభ్రమైన పదార్థాలతో తయారైన జిలేబీ రుచికరంగా ఉండటంతో పాటు ఆరోగ్యపరంగా కూడా కొంతమేర మేలు చేస్తుందని పేర్కొంటున్నారు. ఆహారంలో మితమే ఆరోగ్యానికి మేలని వైద్య నిపుణులు మరోసారి గుర్తు చేస్తున్నారు. అప్పుడప్పుడు పరిమితంగా జిలేబీ తీసుకోవడం ఆనందాన్ని ఇవ్వడమే కాకుండా తీపి రుచిని ఆస్వాదించే అవకాశం కల్పిస్తుందని చెబుతున్నారు.

వేద న్యూస్

ఆదివారం మే 10, 2026

# చెన్నై జట్టు ఎంపికపై బద్రీనాథ్ అసంతృప్తి



**వేద న్యూస్ డెస్క్:**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026లో చెన్నై సూపర్ కింగ్స్ తీసుకుంటున్న జట్టు ఎంపిక నిర్ణయాలు చర్చనీయాంశంగా మారాయి. భారీ మొత్తాలకు కొనుగోలు చేసిన ఆటగాళ్లకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నారంటూ జట్టు మాజీ ఆటగాడు సుబ్రహ్మణ్యం బద్రీనాథ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో చెన్నై విజయం సాధించినప్పటికీ, జట్టు ఎంపిక తీరుపై ఆయన విమర్శలు గుప్పించారు. ముఖ్యంగా మంచి ఫామ్‌లో ఉన్న వెస్టిండీస్ స్పిన్నర్ అఖీల్ హొసేన్‌ను పక్కన పెట్టి, రూ.14.20 కోట్లు వెచ్చించి తీసుకున్న ప్రశాంత్ వీర్‌కు అవకాశం ఇవ్వడాన్ని ఆయన తప్పుబట్టారు.తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడిన బద్రీనాథ్, ఆటగాళ్ల ప్రతిభ కంటే వారి ధరను బట్టి అవకాశాలు ఇస్తున్నట్లు కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. మ్యాచ్ గెలిచినంత మాత్రాన ప్రతి నిర్ణయం సరైందని భావించకూడదన్నారు.ప్రత్యేకంగా పవర్ ప్లే సమయంలో అనుభవం లేని బౌలర్‌తో బౌలింగ్ చేయించడం వ్యూహాత్మకంగా సరైన నిర్ణయం కాదని పేర్కొన్నారు. ఇప్పటివరకు నాలుగు మ్యాచ్‌లలో ఆరు వికెట్లు తీసిన అఖీల్ హొసేన్ వంటి ఫామ్‌లో ఉన్న బౌలర్‌ను పక్కన పెట్టడం ఆశ్చర్యకరమన్నారు.ముంబైతో జరిగిన మ్యాచ్‌లో ప్రశాంత్ వీర్ రెండు ఓవర్లలో 25 పరుగులు ఇచ్చి ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడని గుర్తు చేశారు. గతంలో ఐపీఎల్ అనుభవం కూడా పెద్దగా లేని ఆటగాడికి కీలక సమయంలో ఓవర్లు ఇవ్వడం సరైన వ్యూహం కాదన్నారు.అయితే మరోవైపు చెన్నై భారీ మొత్తం వెచ్చించి తీసుకున్న కార్తీక్ శర్మ మాత్రం తన ప్రతిభను నిరూపించుకున్నాడు. ఈ మ్యాచ్‌లో అతను తన ఐపీఎల్ కెరీర్‌లో తొలి అర్ధ సెంచరీ నమోదు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు.ప్రతిభ కంటే ధరకు ప్రాధాన్యత ఇస్తే భవిష్యత్తులో జట్టు సమతుల్యత దెబ్బతినే ప్రమాదం ఉందని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# రోహిత్ శర్మ చేతి వాచ్ లాగేందుకు అభిమానుల యత్నం




**వేద న్యూస్ డెస్క్:**

భారత మాజీ కెప్టెన్, ముంబై ఇండియన్స్ స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మకు అభిమానుల నుంచి ఊహించని అనుభవం ఎదురైంది. కారులో ప్రయాణిస్తున్న సమయంలో ఆయన చేతికి ఉన్న ఖరీదైన వాచ్‌ను ఇద్దరు యువకులు లాగేందుకు ప్రయత్నించిన ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.వైరల్ అవుతున్న వీడియోలో రోహిత్ శర్మ తన కారు వెనుక సీట్లో కూర్చుని అభిమానులకు అభివాదం చేస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ సమయంలో ఇద్దరు యువకులు కారుకు అత్యంత సమీపంగా వచ్చి రోహిత్ చేతిని పట్టుకునేందుకు ప్రయత్నించారు. వారిలో ఒకరు ఆయన చేతికి ఉన్న వాచ్‌ను తీసుకునేందుకు ప్రయత్నించినట్లు వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది.ఈ ఘటనను గమనించిన రోహిత్ వెంటనే అప్రమత్తమై కారు అద్దాన్ని పైకెత్తి వారిని దూరంగా వెళ్లాలని హెచ్చరించారు. వేలు చూపిస్తూ కఠినంగా స్పందించినట్లు వీడియోలో కనిపించింది.రోహిత్ శర్మ ధరించిన ఆ వాచ్ ప్రముఖ లగ్జరీ బ్రాండ్‌కు చెందిన ప్రత్యేక మోడల్ అని, దాని విలువ సుమారు రూ.3.25 కోట్లు ఉంటుందని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై అధికారిక సమాచారం వెలువడలేదు.ఇదిలా ఉండగా ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో రోహిత్ శర్మ అద్భుత ఫామ్‌లో కొనసాగుతున్నాడు. ఇటీవల లక్నో జట్టుతో జరిగిన మ్యాచ్‌లో కేవలం 44 బంతుల్లో 84 పరుగులు చేసి ముంబై ఇండియన్స్ విజయంలో కీలక పాత్ర పోషించాడు.అయితే ఈ సీజన్‌లో ముంబై ఇండియన్స్ జట్టు ఆశించిన స్థాయిలో రాణించలేకపోతోంది. ఇప్పటివరకు ఆడిన పది మ్యాచుల్లో ఏడు పరాజయాలు చవిచూసిన ఆ జట్టు ప్లేఆఫ్స్ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. .

# ఆరెంజ్, పర్పుల్ క్యాప్ రేసులో హోరాహోరీ




**వేద న్యూస్ డెస్క్:**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ ఉత్కంఠభరితంగా కొనసాగుతోంది. ప్లేఆఫ్స్ పోరు ఎంత ఆసక్తికరంగా సాగుతుందో, వ్యక్తిగత రికార్డుల కోసం ఆటగాళ్ల మధ్య పోటీ కూడా అదే స్థాయిలో ఉత్కంఠ రేపుతోంది. ముఖ్యంగా అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌కు ఇచ్చే ఆరెంజ్ క్యాప్, అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌కు ఇచ్చే పర్పుల్ క్యాప్ కోసం గట్టి పోటీ నెలకొంది.ఈ సీజన్‌లో బ్యాటింగ్ విభాగంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాళ్లు ఆధిపత్యం చాటుతున్నారు. ప్రస్తుతం అత్యధిక పరుగులు చేసిన తొలి ఐదుగురు బ్యాటర్లలో ముగ్గురు హైదరాబాద్ జట్టుకు చెందినవారే కావడం విశేషం.హెన్రిచ్ క్లాసెన్ 494 పరుగులతో అగ్రస్థానంలో కొనసాగుతూ ఆరెంజ్ క్యాప్‌ను నిలబెట్టుకున్నాడు. మరో ఓపెనర్ అభిషేక్ శర్మ 475 పరుగులతో రెండో స్థానంలో ఉన్నాడు. ఢిల్లీ జట్టుకు చెందిన కేఎల్ రాహుల్ 468 పరుగులతో మూడో స్థానంలో కొనసాగుతున్నాడు.కోల్‌కతాతో జరిగిన కీలక మ్యాచ్‌లో కేఎల్ రాహుల్ పెద్ద ఇన్నింగ్స్ ఆడితే అగ్రస్థానానికి చేరుకునే అవకాశం ఉండగా, కేవలం 23 పరుగులకే పరిమితమవడంతో ఆ అవకాశాన్ని కోల్పోయాడు.ఇక సన్‌రైజర్స్‌కు చెందిన ఇషాన్ కిషన్ 409 పరుగులతో నాలుగో స్థానంలో ఉండగా, రాజస్థాన్ రాయల్స్ యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ 404 పరుగులతో ఐదో స్థానంలో నిలిచి ఆకట్టుకుంటున్నాడు.బౌలింగ్ విభాగంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ 17 వికెట్లతో పర్పుల్ క్యాప్ రేసులో ముందంజలో ఉన్నాడు. చెన్నై జట్టుకు చెందిన అన్షుల్ కాంబోజ్ కూడా 17 వికెట్లు తీసినప్పటికీ, మెరుగైన ఎకానమీ రేటు కారణంగా భువనేశ్వర్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.లక్నో జట్టుకు చెందిన ప్రిన్స్ యాదవ్, గుజరాత్ టైటాన్స్ స్టార్ పేసర్ కగిసో రబడా చెరో 16 వికెట్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నారు.తాజాగా ఢిల్లీ, కోల్‌కతా మధ్య జరిగిన మ్యాచ్ అనంతరం బౌలింగ్ పట్టికలో మార్పులు చోటుచేసుకున్నాయి. కోల్‌కతా ఫాస్ట్ బౌలర్ కార్తీక్ త్యాగి రెండు వికెట్లు పడగొట్టి తొలి పది మంది జాబితాలోకి చేరాడు. ప్రస్తుతం అతను 13 వికెట్లతో ఏడో స్థానంలో కొనసాగుతున్నాడు.లీగ్ దశ ముగిసేలోపు ఆరెంజ్, పర్పుల్ క్యాప్ జాబితాల్లో మరిన్ని మార్పులు చోటుచేసుకునే అవకాశం కనిపిస్తోంది.

# జైపూర్‌లో కీలక పోరు.. రాజస్థాన్, గుజరాత్ అమీతుమీ




**వేద న్యూస్ డెస్క్:**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ ఆసక్తికర దశకు చేరుకుంది. ప్లేఆఫ్స్ రేసు మరింత ఉత్కంఠగా మారుతున్న వేళ, నేడు జైపూర్‌లోని సవాయ్ మాన్ సింగ్ స్టేడియంలో రాజస్థాన్ రాయల్స్, గుజరాత్ టైటాన్స్ జట్లు తలపడనున్నాయి. ఇరు జట్లకూ ఈ మ్యాచ్ అత్యంత కీలకంగా మారింది.రాజస్థాన్ రాయల్స్ జట్టు ఇటీవల ఆశించిన స్థాయిలో రాణించలేకపోతోంది. గత ఐదు మ్యాచుల్లో మూడు పరాజయాలు ఎదురుకావడంతో ఆ జట్టుపై ఒత్తిడి పెరిగింది. నేటి మ్యాచ్‌లో విజయం సాధిస్తే ప్లేఆఫ్స్ అవకాశాలు బలపడనున్నాయి. ఒకవేళ ఓడిపోతే తర్వాతి మూడు మ్యాచుల్లో కనీసం రెండింటిలో తప్పక గెలవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.ఇంకా రాజస్థాన్ తదుపరి మ్యాచ్ మే 17న ఉండటంతో మధ్యలో వచ్చే విరామం కూడా ఆ జట్టుకు ఒత్తిడిని పెంచుతోంది. ఇతర జట్ల ఫలితాలు పాయింట్ల పట్టికపై ప్రభావం చూపే అవకాశం ఉండటంతో ఈ మ్యాచ్ రాజస్థాన్‌కు అత్యంత కీలకంగా మారింది.మరోవైపు గుజరాత్ టైటాన్స్ అద్భుతమైన ఫామ్‌లో కొనసాగుతోంది. వరుసగా మూడు విజయాలు సాధించిన ఆ జట్టు అదే జోరును కొనసాగించాలని చూస్తోంది. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో మధ్యస్థానంలో ఉన్న గుజరాత్, ఈ మ్యాచ్‌లో గెలిస్తే నేరుగా తొలి నాలుగు స్థానాల్లోకి చేరే అవకాశం ఉంది.శుభ్‌మన్ గిల్ నాయకత్వంలో గుజరాత్ బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమతూకంగా కనిపిస్తోంది. ముఖ్యంగా టాప్ ఆర్డర్ మంచి ఫామ్‌లో ఉండటం ఆ జట్టుకు పెద్ద బలంగా మారింది.జైపూర్ పిచ్ సాధారణంగా స్పిన్నర్లకు అనుకూలంగా ఉండటంతో ఇరు జట్ల స్పిన్ బౌలర్లు కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. సంజూ శాంసన్ సారథ్యంలో రాజస్థాన్ తమ హోమ్ గ్రౌండ్ అడ్వాంటేజ్‌ను వినియోగించుకోవాలని చూస్తుండగా, గుజరాత్ మరో విజయంతో ప్లేఆఫ్స్ రేసులో దూసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకుంది.

# డోపింగ్ పరీక్షలకు గైర్హాజరు.. జైస్వాల్, షఫాలీకి నోటీసులు





**వేద న్యూస్ డెస్క్:**

భారత క్రికెటర్లు యశస్వి జైస్వాల్, షఫాలీ వర్మలకు జాతీయ యాంటీ డోపింగ్ సంస్థ నోటీసులు జారీ చేసింది. గత ఏడాది నిర్వహించిన డోపింగ్ పరీక్షలకు హాజరుకాకపోవడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు సంస్థ వెల్లడించింది.డోపింగ్ పరీక్షలకు ఎందుకు హాజరుకాలేదనే విషయంపై ఇప్పటివరకు ఇద్దరు ఆటగాళ్లు ఎలాంటి వివరణ ఇవ్వలేదని జాతీయ యాంటీ డోపింగ్ సంస్థ తెలిపింది. ఈ నేపథ్యంలో అధికారిక నోటీసులు జారీ చేసినట్లు పేర్కొంది. యశస్వి జైస్వాల్, షఫాలీ వర్మ ఇద్దరూ రిజిస్టర్డ్ టెస్టింగ్ పూల్‌లో భాగంగా ఉన్నారు. ఈ జాబితాలో ఉన్న క్రీడాకారులు నిర్ణీత సమయాల్లో డోపింగ్ పరీక్షలకు తప్పనిసరిగా హాజరుకావాల్సి ఉంటుంది.ఈ అంశంపై భారత క్రికెట్ నియంత్రణ మండలి, అంతర్జాతీయ క్రికెట్ మండలికి కూడా సమాచారం ఇచ్చినట్లు యాంటీ డోపింగ్ సంస్థ వెల్లడించింది. నోటీసులు అందిన విషయాన్ని బీసీసీఐ వర్గాలు కూడా ధృవీకరించాయి.ఒలింపిక్ క్రీడల్లో క్రికెట్‌కు చోటు లభించిన నేపథ్యంలో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అన్ని డోపింగ్ నిబంధనలు కఠినంగా అమలు చేయాల్సి ఉంటుందని బీసీసీఐ అధికారులు పేర్కొన్నారు.ప్రస్తుతం యశస్వి జైస్వాల్ ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో రాజస్థాన్ జట్టు తరఫున ఆడుతుండగా, షఫాలీ వర్మ భారత మహిళల జట్టులో కీలక ఆటగాళ్లలో ఒకరిగా కొనసాగుతున్నారు. ఇటీవల దక్షిణాఫ్రికాతో జరిగిన సిరీస్‌లో కూడా షఫాలీ పాల్గొన్నారు.నిబంధనల ప్రకారం వరుసగా మూడు సార్లు డోపింగ్ పరీక్షలకు గైర్హాజరవుతున్న క్రీడాకారులపై నిషేధం విధించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం జాతీయ యాంటీ డోపింగ్ సంస్థ రిజిస్టర్డ్ టెస్టింగ్ పూల్‌లో 13 మంది భారత క్రికెటర్లు ఉన్నారు.ఇటీవల ఈ జాబితాలో అభిషేక్ శర్మ, అక్షర్ పటేల్ కూడా చేరినట్లు సమాచారం. గతంలో నిషేధిత ఉత్ప్రేరక పదార్థం వినియోగించిన కేసులో భారత క్రికెటర్ పృథ్వీ షాపై ఎనిమిది నెలల నిషేధం విధించిన విషయం తెలిసిందే.

వేద న్యూస్
ఆదివారం మే 10, 2026



# 'మేం వయసుకువచ్చాం' హీరోయిన్‌లో భారీ మార్పు

**వేద న్యూస్ డెస్క్:**

ప్రేమకథా చిత్రాలు ఎప్పుడూ ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంటాయి. అలాంటి చిత్రాల్లో 2012లో విడుదలైన 'మేం వయసుకువచ్చాం' కూడా ఒకటి. యూత్‌ను విశేషంగా ఆకట్టుకున్న ఈ సినిమా అప్పట్లో మంచి విజయాన్ని అందుకుంది. త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో తనీష్, నితి టేలర్ ప్రధాన పాత్రల్లో నటించారు. శేఖర్ చంద్ర అందించిన సంగీతం కూడా సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముఖ్యంగా నితి టేలర్ తన క్యూట్ నటనతో యువత మనసులు దోచుకుంది. మొదటి సినిమాతోనే మంచి గుర్తింపు తెచ్చుకున్న నితి టేలర్, ఆ తర్వాత బాలీవుడ్‌లో కూడా కొన్ని ప్రాజెక్టుల్లో నటించింది. అయితే గత కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉంటున్న ఆమె, ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో మాత్రం బాగా చురుకుగా కనిపిస్తోంది. 'మేం వయసుకువచ్చాం' సినిమాలో అమాయకమైన లుక్స్‌తో కనిపించిన నితి, ఇప్పుడు పూర్తిగా గ్లామరస్ అవతారంలో అభిమానులను ఆకట్టుకుంటోంది. ఆమె తాజా చిత్రాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. తన అందం, స్టైలిష్ ఫోటోలతో నితి టేలర్ మళ్లీ వార్తల్లో నిలుస్తోంది. సినిమాలకు దూరంగా ఉన్నప్పటికీ, అభిమానులతో మాత్రం నిరంతరం అనుబంధాన్ని కొనసాగిస్తోంది. ఆమె తాజా ఫోటోలను చూసిన అభిమానులు అప్పటితో పోలిస్తే ఇప్పుడు ఎంతో మారిపోయిందంటూ కామెంట్లు చేస్తున్నారు. ఇండస్ట్రీలో కొనసాగి ఉంటే నితి టేలర్ ప్రస్తుతం అగ్ర కథానాయికల్లో ఒకరిగా నిలిచేదని, ప్రాయపడుతున్నారు.

# 'కల్కి' రెండో భాగంపై భారీ అంచనాలు




**వేద న్యూస్ డెస్క్:**

దర్శకుడు నాగ్ అశ్విన్ తెరకెక్కించిన విజువల్ ఫాంటసీ చిత్రం 'కల్కి 2898 ఏడీ' ప్రపంచవ్యాప్తంగా ఘన విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. భారీ వసూళ్లతో పాటు ప్రేక్షకుల ప్రశంసలు దక్కించుకున్న ఈ సినిమా ముగింపులో రెండో భాగానికి ఇచ్చిన సంకేతాలు అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచాయి. తాజాగా 'కల్కి' రెండో భాగానికి సంబంధించిన చిత్రీకరణ, విడుదలపై సినీ వర్గాల్లో కొత్త చర్చ మొదలైంది. ప్రస్తుతం కీలక సన్నివేశాల చిత్రీకరణ వేగంగా కొనసాగుతున్నట్లు సమాచారం. మొదటి భాగం నిర్మాణ సమయంలోనే కొన్ని ముఖ్యమైన ఘట్టాలను దర్శకుడు నాగ్ అశ్విన్ చిత్రీకరించినట్లు తెలుస్తోంది. ఇప్పుడు మిగిలిన భాగాన్ని పూర్తి చేసే పనిలో చిత్ర బృందం నిమగ్నమైందని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. వచ్చే ఏడాది ద్వితీయార్థం నాటికి చిత్రీకరణ పూర్తిచేయాలనే లక్ష్యంతో బృందం పనిచేస్తోందని సమాచారం. ఇదే సమయంలో దృశ్య ప్రభావాల పనులు కూడా సమాంతరంగా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. మొదటి భాగంతో పోలిస్తే రెండో భాగంలో మరింత భారీ స్థాయిలో దృశ్య వైభవం ఉండబోతుందని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రత్యేక ప్రభావాల కోసం ఎక్కువ సమయం అవసరమవుతుండటంతో, అన్ని పనులు పూర్తి చేసి 2027 చివర్లో సినిమాను విడుదల చేయాలని నిర్మాతలు భావిస్తున్నట్లు సమాచారం. మొదటి భాగంలో ప్రభాస్ పాత్రకు వచ్చిన స్పందన, ముఖ్యంగా కర్ణుడిగా చూపించిన తీరు అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంది. అలాగే కమల్ హాసన్ పోషించిన సుప్రీం యాస్కిన్ పాత్ర కూడా సినిమాపై మరింత ఆసక్తిని పెంచింది. రెండో భాగంలో ప్రభాస్, కమల్ హాసన్ పాత్రల మధ్య జరిగే ఘర్షణ ప్రధాన ఆకర్షణగా నిలవనుందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. యాక్షన్, భావోద్వేగాలు, పురాణ అంశాలను కలిపి మరింత భారీ స్థాయిలో కథను తీర్చిదిద్దుతున్నట్లు తెలుస్తోంది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రం భారతీయ సినీ పరిశ్రమలో మరో




# 'రావు బహదూర్' విడుదల వాయిదా

**వేద న్యూస్ డెస్క్:**

నటుడు సత్యదేవ్ ప్రధాన పాత్రలో దర్శకుడు వెంకటేష్ మహా తెరకెక్కిస్తున్న మానసిక థ్రిల్లర్ చిత్రం 'రావు బహదూర్' విడుదల తేదీ మారింది. మొదట ఈ చిత్రాన్ని జూన్ 5న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్ర బృందం భావించినప్పటికీ, అదే సమయంలో విడుదల కానున్న భారీ చిత్రాలతో పోటీని దృష్టిలో పెట్టుకుని వాయిదా వేసినట్లు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రాన్ని జూలై 3, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని నిర్మాతలు నిర్ణయించారు. రామ్ చరణ్ నటిస్తున్న 'పెద్ది' చిత్రం జూన్ 4న విడుదలకు సిద్ధమవుతుండటంతో బాక్సాఫీస్ వద్ద పోటీని నివారించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. సూపర్ స్టార్ మహేష్ బాబు సమర్పణలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని జీఎంబీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై నిర్మిస్తున్నారు. 'కంచరపాలెం కథలు' చిత్రంతో గుర్తింపు పొందిన వెంకటేష్ మహా ఈ సినిమాకు దర్శకత్వం వహించడంతో పాటు కథ, కథనం, ఎడిటింగ్ బాధ్యతలను కూడా నిర్వహిస్తున్నారు.


ఈ చిత్రంలో సత్యదేవ్ సరసన దీపా థామస్ కథానాయికగా నటిస్తోంది. వికాస్ ముప్పాల, బాల పరాశర్, ఆనంద్ భారతి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఒక పురాతన రాజవంశం, వారసత్వ రహస్యాలు, అనుమానాల నేపథ్యంలో సాగే మానసిక థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ప్రత్యేకంగా సత్యదేవ్ ఇందులో వయోవృద్ధుడి పాత్రలో కనిపించబోతుండటం ఆసక్తిని పెంచుతోంది. "అనుమానం పెనుభూతం" అనే ట్యాగ్‌లైన్‌తో రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, అలాగే "ఓ సుందరి" పాట ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. విభిన్న కథాంశాలతో సినిమాలు తెరకెక్కించే వెంకటేష్ మహా, ఈసారి కూడా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించనున్నారని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# 'రౌడీ జనార్ధన' పోస్టర్ విడుదల

**వేద న్యూస్ డెస్క్:**

టాలీవుడ్ ప్రముఖ నటుడు విజయ్ దేవరకొండ పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులకు చిత్ర బృందం ప్రత్యేక కానుక అందించింది. యువ దర్శకుడు రవికిరణ్ కోల దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'రౌడీ జనార్ధన' చిత్రం నుంచి కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో విజయ్ దేవరకొండ ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తూ అభిమానులను ఆకట్టుకుంటున్నాడు. హీరో గుండెపై కథానాయిక కాలు పెట్టిన ప్రత్యేక డిజైన్‌తో రూపొందిన ఈ పోస్టర్ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

"ప్రపంచంతో పోరాడే మొండివాడు.. కానీ ప్రేమకు మాత్రమే తలవంచుతాడు" అనే క్యాప్షన్‌తో పోస్టర్‌ను విడుదల చేయడం అభిమానుల్లో మరింత ఆసక్తిని పెంచుతోంది. సినిమాలో విజయ్ పాత్ర మాస్, భావోద్వేగాల కలయికగా ఉండబోతుందనే సంకేతాలు ఈ పోస్టర్ ద్వారా కనిపిస్తున్నాయని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ చిత్రంలో కీర్తి సురేష్ కథానాయికగా నటిస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై భారీ వ్యయంతో ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌పై మంచి అంచనాలు నెలకొనగా, తాజా పోస్టర్‌తో సినిమాపై మరింత హైప్ ఏర్పడింది. విజయ్ దేవరకొండ గత చిత్రాల తర్వాత పూర్తి స్థాయి మాస్ ఎంటర్‌టైనర్‌గా 'రౌడీ జనార్ధన' తెరకెక్కుతోందని టాలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. దర్శకుడు రవికిరణ్ కోల కూడా విజయ్‌ను కొత్త కోణంలో చూపించేందుకు ప్రత్యేక శ్రద్ధ




తీసుకుంటున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ పోస్టర్‌ను అభిమానులు పెద్ద ఎత్తున సామాజిక మాధ్యమాల్లో పంచుకుంటూ విజయ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073